# పొమ్మనలేక....

## ముద్దంశెట్టి హనుమంతరావు

బాలాకాలానికి మళ్ళీ విశాఖపట్నం వెళ్ళవల్సి వచ్చింది అనంతంకి. ప్రయాణమంటే - అతనికి మహా చెడ్డ భయం. ప్రయాసకి తోడు డబ్బుకూడా ఖర్చవుతుందని యెక్కడికీ వెళ్ళడు. కాని యీసారి విశాఖపట్నం పోవటం తప్పనిసరయ్యింది. అతని భాగస్థుడు సత్యం విశాఖపట్నం కె. జి. హాస్పటల్‌లో వుండటంవల్ల కేవలం అతన్ని ఓసారి చూసిరావాలన్న వాంఛతో బయల్దేరాడు.

బయల్దేరాడేగాని, అక్కడ ఎవరింట్లో మకాం వేయటమో తట్టలేదు. ఇంతకుముందెప్పుడో వెళ్ళినప్పుడు స్వయాన బావమరిది అక్కడుండటంవల్ల వాళ్ళింట్లో దిగవేశాడు కానియిప్పుడు బావమరిది అక్కణ్ణించి బదిలీ అవ్వటంతో అనంతంకి గట్టి చిక్కొచ్చిపడింది. తనకి దగ్గరిబంధువులు, కావలసినవాళ్లు విశాఖలో యెవరెవరున్నారో ఒక్కసారి స్మృతిపథంలోకి తెచ్చుకున్నాడు ముగ్గురు నలుగురున్నారే గాని - వాళ్ళకీ తనకీ అట్టే సరిపడదు ... పోతే రైల్వే గార్డుశాస్త్రికూడా అక్కడేవున్నట్టు యిప్పుడతనికి తట్టింది .... శాస్త్రి అంతదగ్గరి బంధువు కాకపోయినా అభిమానస్థుడు ... ఓమారు అతడు శ్రీకాకుళం వచ్చినప్పుడు అనంతం యింటికి వచ్చాడు చుట్టంచూపుగా వచ్చి వెంటనే వెళ్లిపోయాడు ... అప్పుడన్నాడు కూడా, 'మీరెప్పుడన్నా విశాఖపట్నం రావటం గాని తటస్థిస్తే మా యింట్లో ఓరోజున్నుండి మీరు వెళ్లాలి .' అని అనంతంకి ఆ మాటలు స్పష్టంగా యిప్పటికీ జ్ఞాపకమున్నయ్. తక్కిన బంధువులకంటే శాస్త్రి కాస్త మెరుగేనని పించిందతనికి. ఆ వున్న ఒక్క రోజూ వాళ్ళింట్లో గడిపేయాలన్న సంకల్పంతో బయల్దేరాడు.

ఉదయం పదిన్నరకంతా విశాఖపట్నం చేరుకున్నాడు...శాస్త్రి చెప్పిన ఆనవాలు బట్టి వాళ్ళింటికి త్రోవ తీశాడు...అట్టే శ్రమపడకుండానే వాళ్లిల్లు తెలుసుకోగలిగాడు.

శాస్త్రి సతీమణి అన్నపూర్ణ అనంతంని చూడగానే ముందుకి వస్తూ

"ఏం బాబాయ్ - యిదే రావటమా?" అంది.

"ఔనమ్మ, యిప్పుడే వస్తున్నా. మా అల్లుడేడీ?" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"డ్యూటీకి వెళ్లారు బాబాయ్ .."

"ఎప్పుడొస్తాడూ?"

"చెప్పలేం...రేపు, లేకుంటే యెల్లుండి రావచ్చు .."

"అతనుంటాడని యెంతో సంబరపడ్డాను ..ఆ మధ్య శ్రీకాకుళం వచ్చినప్పుడు మా యింటికి వచ్చాడు. తనెప్పుడూ రావటం లేదని నిందవేశాడు... అయినా అమ్మాయ్ ప్రయాణమంటే మాటలతో పనా? ప్రయాసకి ప్రయాస వుంటుంది ..డబ్బుకి డబ్బూ మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చవుతుంది ..అందుకే నేనెక్కడికీ వెళ్ళను ఏదో యిప్పుడంటే విధిలేక రావటమయ్యింది .." అనంతం యీ వుపోద్ఘాతమంతా వలకబోస్తూవుంటే అన్నపూర్ణకి విసుగనిపించింది ఇంతలో ఆమె అయిదేళ్ళ చిన్న కొడుకు వడిగా నడుచుకుంటూ అనంతం దగ్గరికి వచ్చాడు. .నిజంగా అనంతం అప్పుడు చాల బాధపడ్డాడు- పిల్లలుంటారని తెలిసికూడా కనీసం బిస్కెట్లయినా తెచ్చాను కానే! అని; ఇప్పుడేం లాభం బాధపడి! అందుకే ఆప్యాయంగా కుర్రాణ్ణి యెత్తుకొని

"నీ పేరేమిట్రోయ్ వంతులూ?" అన్నాడు నవ్వుతూ.

"రాము..." ముద్దులొలికేట్టు చెప్పాడు అబ్బాయి...

"అచ్చంగా మీ నాన్న పోలికే" అంటూ

---

## ★ తీరికసమయాలలో ద్రవ్యార్జన ★

వారికి ఆర్థిక సదుపాయాలను కలిగించటానికై అగ్గిపెట్టెల కర్మాగారాలు దేశములో అక్కడక్కడ స్థాపింప బడుతున్నాయి. స్త్రీలు గడపదాటకుండా, తీరిక సమయాలలో ఈ పనులు చేసి ఆదాయాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

ప్రతి మహిళాసమాజమూ ఒక విక్రమశాలను అనుబంధముగా ఏర్పరచుకొన్నట్లయితే దాని ద్వారా స్త్రీలు తమతమ చేతి పనులను రెండవకంటి వాళ్ళకు తెలియకుండా విక్రయించటానికి వీలవుతుంది ఊరగాయలు, అప్పడాలు, వడియాలు, సేకిలు, చట్నీపొడి, అన్నపుపొడి, చారు, పులుసుపొడి, మొదలైనవి పరిశుభ్రముగా తయారుచేసి విక్రయానికి పెటవచ్చు ఈవిధముగానే కుట్టుపనులు వచ్చిన స్త్రీలు తాము తయారు చేసిన వస్తువులకు ధరలు వేసి, విక్రయశాలలో అమ్మకానికి పంపవచ్చు. స్త్రీలకు కావలసిన సరకులు, వస్తువులు స్త్రీల చేత తయారుచేయబడిన వాటిని విక్రయించటానికి మహిళా సమాజాలు పూనుకొన్నట్లయితే సామాన్య స్త్రీలకు కొన్ని వసతులను కల్పించినవి కాగలవు. ఈ విక్రయశాలలలో, స్త్రీలకు తీరుబాటయిన సమయాలలో, విక్రయించటానికి స్త్రీలనే వేతనాల మీద నియమించవచ్చు దీనివల్ల కొంతమందికి విక్రయశాలలలో పనిచేసే అవకాశము లభించుతుంది గుంటూరులోని శారదానికేతనములో ఈ విధానము ప్రవేశపెట్టబడినట్లు తెలియవచ్చినది. ఇది సంతోషకరమైన వార్త

పెట్టుబడి పెట్టి వస్తువులను తయారు చేయలేని వారిచేత, సమాజాలే పెట్టుబడి పెట్టి తయారుచేయించాలి ఆ స్త్రీల వద్ద ఉన్న పాటవము ఉపయోగపడేటట్లు చూడాలి ఒక గ్రామములో గాని ఒక నగరములో గాని ఒక మహిళా సమాజము స్థాపింపబడినట్లయితే ఆ ప్రాంతపు స్త్రీల అవసరాలన్ని దాని ద్వారా తీరవలసినదే స్త్రీలు తమకు సహజముగావున్న పరిపాలనాదక్షత, ప్రజ్ఞ సమాజ నిర్వహణములో కనబరచినట్లయితే వాటిని సార్థకపరచటమే కాకుండా, స్త్రీజనానికి ఆరోగ్యకరమైన చింతనను కలిగించినవారు కూడా అవుతారు. ★

అబ్బాయిని హృదయానికి హత్తుకున్నాడు అనంతం. అన్నపూర్ణ తృప్తిగా నవ్వింది. తన పిల్లల్ని చూసి యెవరన్నా ముచ్చట పడ్డారూ అంటే ఆమె ఆనందం వర్ణనాతీతం! ఏ తల్లికైనా ఆ ఆనందం వుంటుంది గాని యీమె ఆనందం మరో రెండుమెట్లు పైనుంటుంది...

గోడగడియారం అప్పుడే టంగ్! టంగ్! మని పదకొండు గంటలు కొట్టింది.

"లేచి మడికట్టుకోండి బాబాయ్-భోంచేద్దురుగాని" అంటూ వంటగదికి వెళ్లిపోయింది అన్నపూర్ణ...

అన్నపూర్ణ అదోతరహా మనిషి. ఎగుటి మనుషుల మొహాన యేవీ అనదు... కాని వాళ్ల పరోక్షంలో వారిపైగల కసి వెళ్ళగక్కుకొంటుంది తనవాళ్లు యెవరన్నా చుట్టంచూపుగా వస్తే బాధలేదుగాని, దూరపుబంధువు లెవరన్నా ఖర్మంచాలక వచ్చారా, వాళ్ల మొహాన కాకపోయినా, వాళ్ల వెనక ఆడిపోసుంది...తమాషా యేమిటి అంటే ఆమెని చెడ్డగా అభిప్రాయపడిన వాళ్లు యింతవరకూ యెవ్వరూ లేరు. ముఖప్రీతి బాగా అలవర్చుకోవటమే ఆమెలో వున్న గొప్పతనం!

అనంతం భోజనం ముగిసింతరువాత తృప్తిగా త్రేన్చుకుంటూ వాలుకుర్చీలో కూర్చున్నాడు. కాస్సేపు కళ్ళుమూసి నిద్రకోసం ప్రయత్నించాడు. వీధినుండి చల్లని గాలి సోకుతూవుంటే అతని ప్రయత్నం ఫలించింది. కాని యింతలో 'రాము' శాపటముతో నిద్రాభంగమయ్యింది మధ్యాహ్నంపూట ఒకసారి నిద్రనుండి మెలకువ వచ్చిందంటే చచ్చినా మరి నిద్ర పట్టదు అనంతంకి మొదట్నుంచీ యీ అలవాటు ఆచరణలోకి వచ్చింది 'రామూ'ని వళ్లోకి తీసుకుని ఓమారు గడియారం వేపు దృష్టిని ప్రసరించాడు. ఒంటిగంటయింది. కాస్సేపయినా నిద్రపట్టినందుకు సంతసించాడు.

పనులన్నీ పూర్తి చేసుకుని అన్నపూర్ణ అక్కడికొచ్చి, అరే తీరుబడిసమయంగనుక చాప వేసుకొని కూర్చుంది.

"పెద్దబ్బాయి వుండాలి - యేడీ అమ్మాయ్?" అన్నాడు అనంతమే

"బడికి పోయాడు బాబాయ్..." అందామె.

"శ్రద్ధగా చదువుకుంటున్నాడుగదా!"

"ఆ! యేదో చదువుకుంటున్నాడింతవరకు...ముందు ముందు యేం చేస్తాడో గాని —"

"ఈసారి యెప్పుడన్నా అల్లుడూ, నువ్వూ కలిసి మావూరు రండమ్మాయ్ ... వచ్చిపోతుంటేనే బంధుత్వాలు - చుట్టరికాలూను" అన్నాడు అనంతం.

తనయింటికి వచ్చేబంధువులంతా ఇలాగే ఓమాట అనేసిపోతారు...తను యెక్కడికీ వెళ్లదు గనుకనే తెలిసి తెలిసి అట్లా మాట వరుసకి అనేస్తున్నారని ఆమె అనుమానం.

ఆమె నవ్వింది. "మీ కాపాటి దయ వుంటే అంతేచాలు బాబాయ్...ఎక్కడికి పోవాలన్నా నాకు ప్రతిబంధకాలు యెక్కువ...మావాళ్లింటికి వెళ్లడానికే వీలుండదు..."

"అలాగంటే యెలాగమ్మాయ్...ప్రతిబంధకాలు లేనివాళ్లెవరున్నారు...? అవి మనల్ని తప్పించుకుంటేట్లు మనం ప్రయత్నించాలిగాని..."

"అగి నావల్ల కాదు బాబాయ్...సంసారం బాధ్యతంతా నా నెత్తినే వదిలేశారాయన ఆయన వుద్యోగమేమిటో ఆయంది ..రోజుకి రోజూ నాకు చికాకనిపిస్తుంది... బదిలీ చేయించుకోమని నేనెంత మొత్తుకుంటున్నా ఆయన వినకుండా వున్నారు..." ఏ విషయం మాట్లాడుతూ యే విషయానికి వచ్చిందో ఆమెకి తెలీకపోలేదు...

"ఇక్కడ్నుంచి బదిలీ యేమిటమ్మాయ్: యీవూరు రావాలని యెంతో మంది ప్రయత్నిస్తుంటారు!" ఆశ్చర్యంగానే అన్నాడు అనంతం.

"అందరికీ మంచి స్థలమేగాని, మా విషయంలో మాత్రం చెడ్డదే! మీరు మరేం అనుకోకండి బాబాయ్ మీరొచ్చారని కాదుగాని, యేమిటి, యెప్పుడూ యెవరో బంధువులో స్నేహితులో వస్తూనే వుంటారు. ఆసుపత్రికని, యూనివర్సిటీకని, యెవరో నాయకుడొస్తున్నాడు చూడాలని, ఒకటేమిటి యిల్లాంటి వెన్నో కారణాలు చెప్పుకుని వస్తుంటారు .. వచ్చినవాళ్ళని పొమ్మనలేంగా! పోనీ వచ్చినవాళ్లు ఒక పూటలో పోతారా? అదీలేదు...రెండు మూడు రోజులు తిష్ఠవేస్తారు. మీరే ఆలోచించండి బాబాయ్ ..యీ కరువు కాలంలో అందర్నీ ఆదరించుకొని మనలాంటి వాళ్ళం కూర్చోగలమా? ఇంతా మనం ఆదరిస్తామనుకోండి — మొగమాటానికైనా మన పిల్లల చేతిలో ఓ బిస్కట్టు ప్యాకెట్ పెట్టడానికి కూడా వాళ్లకి తోచకుండదు. తోచటం డబ్బు కాదు లెండి-ఆ యింగితం లేక." అని చిన్న వుపన్యాసం ఇచ్చింది అన్నపూర్ణ

అనంతంకి ముచ్చెమటలు పోశాయి తనని యేమీ అనుకోవద్దని మొదటే చెప్పిందిగాని తన యెగుట అనవల్సిన మాటలేనా యివి! ఎంత నిర్మొహమాటపు మనిషి! తను యిక్కడికి వచ్చి చాల పొరపాటుచేశాడు...ఇంకెవరింటికీ వెళ్ళకపోతే హోటల్లో తినవల్సింది .. అనుకున్నాడు ... వంటిమీదున్న ఖద్దరు బనియను పూర్తిగ తడిసి ముద్దయింది మొహం నిండా చేరిన చిరుచెమట ఓసారి తుండుగుడ్డతో ఒత్తుకుని.

"అబ్బ! గాలన్నది లేదు ... సముద్రపు ఒడ్డునవున్న యీ ప్రదేశంలోనే యిలా వుంటే యింక మావూరుసంగతి వేరే చెప్పాలా? అఁ అన్నట్టు అమ్మాయ్! వేళవుతోంది... యిక నేనలా వెళ్లి వస్తాను..." అంటూ అబ్బాయిని క్రిందికి దించివేశాడు. ఇంక అక్కడుండటం కష్టమనిపించింది. అలాగని పూర్తిగా మకాం యెత్తేయలేడుగా!

"కాస్తయెండ తీవ్రత తగ్గనీయండి బాబాయ్...వెళ్దురుగాని: ఆసుపత్రి తక్కువ దూరముంది కనుకనా: యీలోగా కాఫీ కొద్దిగా కాచియిస్తాను" అంటూ తనూ లేచి నించుంది అన్నపూర్ణ.

"ఇప్పుడు నాకేం కాఫీ వద్దమ్మాయ్.." ముక్తసరిగా అన్నాడు అనంతం.

"మీకోసం ప్రత్యేకంగా పెట్టడం లేదుగా కాఫీ! ప్రతిరోజూ మేం కాఫీ త్రాగుతాం...పోతే యెవరో ఒకరు వుంటనే వుంటారు ..అందుకే మీ అల్లుడు నెలకి పదిహేను శేల చీనీ ఒకేసారి తెచ్చి [illegible]ం చేస్తారు. ఇంతచీనీ నెలాఖరుకి నిండిపోతుంది రెండు కాఫీడబ్బాలు, ఒక్కో నెల చాలవుకూడాను. ఆయనకి డికాక్షను ఘాటుగా వుండాలి .. అదీగాక యెవరికైనా నీళ్లలాంటి కాఫీ యివ్వటం నాకు సిగ్గేస్తుంది..." అంది అన్నపూర్ణ.

అనంతంకి అరికాలినుంట నెత్తికెక్కింది. ఈ వివరాలన్నీ సమగ్రంగా యీవిడ్తో ఎవరు నివేదించమన్నారు? ఆమె అభిప్రాయం, పరాయివాళ్లు వస్తూ పోతుండడం వల్లనే యింత ఖర్చవుతుందని గామోసు! అనుకొని కాఫీకి యింక వుండదల్చుకోలేదు...

"ఆసుపత్రికి ఇప్పుడే వెళ్లనులే అమ్మాయ్. మరో స్నేహితుడు ఇక్కడే వున్నాడు... ఆ విషయం మొదట నాకు తెలీదు...ఇందాక బండిదిగగానే కలిసి మధ్యాహ్నం వాళ్లింటికి రమ్మని మరిమరీ చెప్పాడు... వెళ్లకపోతే బాధపడతాడుగా!" అంటూ దుస్తులు ధరించేందుకు వుపక్రమించాడు అన్నపూర్ణ అట్టే బలవంతపర్చదల్చుకోలేదు గామోసు - వూరుకుంది ... దుస్తులు వేసుకున్నాక ఆమెతో చెప్పి బయలుదేరాడు. నిజానికి అతని కింకెవరూ స్నేహితుల్లేరు...వున్నవాళ్లెవరో బంధువులే గాని; ఏ స్నేహితుడూ ఉదయం తారసపడలేదు. అయినా అలా అబద్ధం చెప్పక తప్పిందికాదా సమయంలో. ఎంత తీవ్రంగా వున్నా, రిక్షా చేయించుకుని తిన్నగా హోటలుకి పోయాడు ... మరెందుకూ కాదు - కాఫీ త్రాగేందుకు. అంతే!

* * *

# ★ పొమ్మనలేక... ★

ఆసుపత్రిలో తన భాగస్తుణ్ణి కలుసుకుని, యింకా అక్కడక్కడ బజార్లో తిరిగి, అతి జ్ఞాపకంగా ఒక బిస్కట్ల ప్యాకెట్ కొని శాస్త్రి యింటికి తిరుగుముఖం పట్టాడు అనంతం. బిస్కట్లు కొనాలన్న విషయం కొనేవరకూ నెమరు వేసుకుంటూనే వున్నాడు. ఔను మరి! అందర్నీ అతని యెగుడేది నిందిస్తుంటే అదే నిందని అతనెందుకు భరిస్తాడు! అందుకని తప్పనిసరిగా కొన్నాడు.

సాయంత్రం అయిదు గంటలకి యిల్లు చేరుకున్నాడు. ఇల్లు చేరుకున్న వెంటనే అగుపించిన రామూకి బిస్కట్ల ప్యాకెట్ అందించాడు. ఆ అబ్బాయ్ గెంతు గెంతుగ గంతులేసుకుంటూ రెండు చేతుల్లో ప్యాకెట్‌ని అదిమిపట్టి తల్లిదగ్గరికి వేంచేశాడు. కొడుకు చేతిలో బిస్కట్లు చూసిన అన్నపూర్ణ అబ్బురపడి యింట్లోకి వచ్చింది. ఆమె భయమంతా యింకెవరు కొత్త చుట్టాలు వచ్చారోనని. బట్టలు మార్చుకుంటున్న అనంతంని చూసి ఆమె నిబ్బరపడింది. ఆ బిస్కట్లు బాబాయ్ తెచ్చిన వేనని అర్థం చేసుకుంది...

"మాటవరుసకే అన్నానుగాని, అంతలో మీరు బిస్కట్లు తెచ్చి పెట్టాలా బాబాయ్!" అంది చిన్నగా నవ్వుతూ. మొదట్లో బాబాయ్ యెదుటే అలాంటి మాటలు యెందుకన్నానా, అన్న బాధ ఆమెలో లేకపోలేదు.

"నువ్వన్నావని తెచ్చాననుకుంటున్నావా పిచ్చితల్లీ పిల్లలంటే నే, నాకు ముచ్చట...సాధారణంగా నేను బజారుకి పోయానంటే వట్టి చేతుల్తో రాను..." అన్నాడు తన గొప్పతనాన్ని చెప్పుకునే ప్రయత్నంలో. అవుతే అతను చెప్పింది నిజమూ అంటే, కాదు—అనవసరంగా అర్ధణా ఖర్చు పెట్టడానికి భయపడే అనంతం పిల్లలపై వున్న మమతవల్ల రూపాయికి పైన ఖర్చు పెడతాడనటం శుద్ధ అబద్ధం! అవుతే యిప్పుడెందుకు తెచ్చాడూ అంటారేమో! 'తప్పనిసరి.' అన్నపూర్ణ ఆ విషయంలో యింకేమీ అనలేదు. అనదు కూడాను!

"కాఫీ కాస్త తాగుతారా బాబాయ్?" ఆపాటి అభిమానమున్నా 'యిప్పుడు' చూపించకపోతే బావుండదని అంది అన్నపూర్ణ. కాఫీ తాగుతారా? భోజనం చేస్తారా? వట్టి కూరలే తింటారా! అన్నం వడ్డించాలా?...యిలాంటి ప్రశ్నలన్నీ వేస్తే యెవరైనా యెల్లాంటి జవాబు లిస్తారు?

"ఇప్పుడేం కాఫీలే అమ్మాయ్ స్నేహితుడింట్లో యిప్పుడే కాఫీ పుచ్చుకుని వస్తున్నా" జాగర్తగానే జవాబిచ్చాడు అనంతం. అన్నపూర్ణ వెళిపోబోయింది వంటగదికి.

"అల్లుడు యెప్పుడొచ్చేదీ యింకా నిశ్చయంగా తెలీదు కదమ్మాయ్..." అన్నాడు అనంతం. ఆ విషయం అన్నపూర్ణకి తెలుసు...తనకి తెలిసింది చెబితే ఆ మనలాయన తప్పకుండా తిష్ఠవేస్తాడని ఆమె భయం! నిజానికి, శాస్త్రి ఆ రాత్రో లేక మరుచటిరోజు వుదయమో తప్పక వచ్చేస్తాడు...అలాగని చెబితే అనంతం వుండిపోతే గో!...ఆలోచించింది అన్నపూర్ణ... అసలు, యీ విషయం మొదటే అబద్ధం చెప్పింది. ఇప్పుడూ అలాగే చెప్పాలనుకుంది.

"నిశ్చయంగా తెలీదు బాబాయ్. అతని వుద్యోగానికి వేళా, పాళా, అంటూ ఉండదు ఎప్పుడొచ్చి యెప్పుడు వెళ్తారో అంతకంటే నిశ్చయం వుండదు. రేపు యెలాగూ గారు...ఎల్లుండికి రావచ్చు... అదీ సాయంత్రం!" అంది

"అవుతే నేను ఆయనకోసం చూడ్డం అనవసరం...అందుకని రాత్రి బండికే వెళిపోతానమ్మాయ్." అన్నాడు అనంతం.

"ఈవాళేగా వచ్చారు! యేమంత తొందరొచ్చిందని - రేపు వెళిపోండి బాబాయ్.." అంది అన్నపూర్ణ. లోలోపల అతను వెళిపోవాలన్న వాంఛ వున్నా బయటికి అలా అనకపోతే బావుంటుందా? అని ఆమె అభిప్రాయం. అలా అన్నంత మాత్రాన అనంతం వుండిపోయే ఘటం కాదు...ఇతఃపూర్వం అన్నపూర్ణ నివేదించిన వుపన్యాసం అతణ్ణి యెంతో కలత పర్చింది.

"దానికేముందిలే అమ్మాయ్...యీసారి యెప్పుడన్నా వస్తాను" అంటూ వాలు కుర్చీలో చేరగిలబడ్డాడు.

"సరే మీ యిష్టం.. వంట యెలాగూ పూర్తయింది. మీ రెప్పుడు వడ్డించమంటే .." అని చెప్తాంటే అనంతం అందుకుని—

"ఏడు గంటలకి యేదో బండి వుందట - మరో అరగంట పోయాక భోంచేస్తాను" అన్నాడు...

"అలాగే బాబాయ్" అంటూ వంటగదికి వెళిపోయింది అన్నపూర్ణ. అనంతం యెంతో సేపు ఆమె మనస్తత్వాన్ని తర్కించుకుంటూ కూర్చున్నాడు.

అరగంట సరిగ్గా దాటంగానే మడి కట్టుకొంటూ చెప్పింది అన్నపూర్ణ. అనంతం లేచి మడికట్టుకుని కాళ్లు కడుక్కుని విస్తరిముందు కూర్చున్నాడు.

అన్నపూర్ణ నెయ్యి వడ్డిస్తూ "మొన్ననే గుంటూరునుండి యీ నెయ్యి తెప్పించాం బాబాయ్...బోలెడు ఖరీదు......అయినా రుచిగా వుంటుందని తెప్పించాం!" అంది.

అనంతం మనసు చివుక్కుమంది.

"బావుందమ్మాయ్ నేయి" అన్నాడు విధిగా.

"మరి కాస్త నేయి వడ్డించనా?" అందామె నేయి గిన్నె పట్టుకోకుండానే. అనంతం యింక వడ్డించమంటాడూ!

"అబ్బే! వద్దమ్మాయ్...చాలు" ముక్తసరిగా అన్నాడు.

"ఈ బియ్యమున్నయ్ చూశారూ! మేలు రకపు బియ్యం...మణుగు యిరవై యెనిమిది రూపాయలో, యెంతో అన్నారు...... మామూలు ధరవి అమ్ముతున్నారు గాని, మనం తినలేం బాబాయ్...మాకు ఎక్కువ బియ్యం పట్టినా యివే యెప్పుడూ కొంటుంటాం. నెలకి రెండు మణుగులు బియ్యం పడతాయ్..." అంది తినకతానుగా.

నిజంగా అప్పటి అనంతంఅవస్థ వర్ణనాతీతం. అన్నం తిన బుద్ధి పుట్టింది కాదు. అయినా ఆమె యేమనుకుంటుందోనని యెలాగో యెంగిలిపడి మజ్జిగ వేసుకోకుండానే లేచిపోయాడు.

"మజ్జిగ వేసుకోరూ బాబాయ్?" అందామె.

"కొద్దిగా జలుబు చేసినట్టుందమ్మాయ్.. అందుకని మజ్జిగ వేసుకుందుకే భయమేస్తున్నది..." అంటూ వెళ్లి చేయి కడుక్కున్నాడు.

ఇంక ఒక్కక్షణంకూడా వుండదల్చుకోలేదు...త్వరలో బట్టలు వేసుకుని "వస్తానమ్మాయ్...స్టేషను చేరుకునేసరికి యేడవుతుందేమో! అల్లుడొస్తే నే నొచ్చానని చెప్పు" అంటూ బయల్దేరాడు...వెళ్తున్నప్పుడు యిద్దరు అబ్బాయిలకీ 'వెళ్తున్నా పంతుళ్లూ!" అని నవ్వుతూ చెప్పాడు కూడాను.

"ఎంత చెప్పినా వుండనంటున్నారు... మరేం చేస్తాం? ఈ వూరు మళ్ళీ యెప్పుడన్నా వస్తే మా యింటికి తప్పకుండా రండి బాబాయ్" అంది అన్నపూర్ణ వెళిపోతున్న అనంతంతో.

"అలాగే!" అంటూ వడివడిగా నడిచిపోయాడు అనంతం. అంతే! మళ్ళీ యెప్పుడూ శాస్త్రిగడప తొక్కలేదు!

★